క్లుప్తంగా

సంక్రాంతి కొత్త వెలుగులు, ఆనందం నింపాలి


కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : ఈ సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆకాంక్షించారు. జిల్లాలోని ప్రజలందరూ సంక్రాంతి, కనుమ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలు.. అందరూ ఆనందంగా జరుపుకోవాలని మనసారా కోరుకున్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు, రైతులకు వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన పి. నరేన్ రామాంజులరెడ్డి


పి.నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : ప్రజలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాడిపంటలు, సుఖశాంతులతో ప్రజలు తులతూగాలని కాంక్షించారు. పండుగలు మన వారసత్వ ప్రతీకలని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు అత్యంత విలువ ఇచ్చే ప్రజలు నిత్యం సుఖశాంతులతో విలసిల్లాలని ఆయన అభిలషించారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. అలాగే ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి కూడా నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగించండి

వేంపల్లె : జిల్లాలో వివిధ కార్పొరేషన్ల కింద లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేయడానికి ఈ నెల 8వ తేదీన బీసీ సేవా సహకార సంస్థ విడుదల చేసిన ప్రకటనలకు సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించాలని కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ కార్పొరేషన్లకు చెందిన లబ్ధిదారుల ఎంపికకు 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అంతేకాక వివిధ కులాలకు చెందిన అభ్యర్థులకు వారి కుల, ఆదాయ సర్టిఫికెట్లు పొందేందుకు ఈ గడువులో ఐదు రోజులు సెలవు దినాలు వచ్చినందున అవసరమైన అభ్యర్థులు సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ నెల 30 తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించాలని కోరారు.

పార్టీకి పూర్వవైభవం తెస్తాం


నీలవర్ధన్‌రెడ్డి

సింహాద్రిపురం : వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం తెస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా సాకం నీలవర్ధన్‌రెడ్డి ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నీలవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, సింహాద్రిపురం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సింహాద్రిపురానికి చెందిన నీలవర్ధన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో కీలక నాయకుడిగా వ్యవహరిస్తూ గతంలో ఆ పార్టీ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జిగా, నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్‌గా పనిచేశారు.

పడకేసిన పారిశుద్ధ్యం.. అధికారుల చోద్యం


యర్రగుంట్లలో స్వైర విహారం చేస్తున్న పందులు


మురుగుకాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం

- సమస్యలతో యర్రగుంట్ల ప్రజలు సతమతం
- అధ్వానంగా మురుగు కాలువలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దోమలు విలయతాండం చేస్తున్నాయి. అలాగే పందులు కూడా స్వైర విహారం చేస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడడం లేదు. మున్సిపల్ కార్మికులు ప్రతి రోజు ఉదయాన్నే ప్రధాన రహదారులైన కడప రోడ్డు, రాజీవనం కాలనీలో ఉన్న ప్రొద్దుటూరు నాలుగు రోడ్ల కూడలికి మాత్రమే పరిమితమై ఉదయం రోడ్లన్నీ ఊడుస్తున్నారు. కానీ శాంతినగర్ కాలనీ, హరిజనవాడ, షాదిఖానా సమీపంలోని ప్రకాశ్‌నగర్ కాలనీల్లో చెత్త పేరుకుపోతోంది.

పందులు స్వైర విహారం

పట్టణంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందుల పెంపకంపై నిబంధనలు విధించినా పెంపకందారులు వాటిని వీధుల్లో వదిలేయడంతో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. మున్సిపల్ సిబ్బంది చెత్తను పూర్తిస్థాయిలో తరలించకపోవడంతో పందులు చెల్లాచెదురు చేయడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్థంగా మారింది. పందులు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో వ్యాధులు ప్రబలుతాయని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, పిల్లలపై దాడులు చేస్తున్నాయని పలు మార్లు మున్సిపల్ అధికారులు ప్రజలు ప్రజాప్రతినిధులు ఫిర్యాదులు చేస్తున్న వాటిని నివారణ జరగలేదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రధాన రహదారులతో పాటు వీధులలో పేరుకోపోయిన చెత్తచెదారాన్ని శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి దేవస్థానంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రుద్రమూర్తి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, రుద్ర పారాయణం, భస్మాభిషేకం, నైవేద్యం, మహా మంగళ హారతి తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు అయ్యప్పస్వామి పడిపూజ

పులివెందుల పట్టణంలోని కోతి సమాధి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వెంకటరామిరెడ్డి గురుస్వామి తెలిపారు. మకరసంక్రాంతి పర్వదినం సందర్భంగా శబరిమలై అయ్యప్ప స్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శనం సందర్భంగా సాయంత్రం 6గంటలకు పడిపూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో విశేష పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆరోగ్యానిచ్చే భోగి మంటలు

భోగి పండుగను ఊరువాడ నిర్వహించారు. అయితే భోగి మంటలు వెనుక ఆరోగ్య రహస్యం ఉంది. భోగి మంటల్లో ఆవు పిడకలు, ఔషధ చెట్ల బెరడులు లాంటివి వేసి కాల్చడం వలన గాల్లో సూక్ష్మక్రిములు నశించి గాలి శుద్ధి అవుతుందట. అంతేకాదు చలికాలంలో శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అలాంటి వాటిబారిన పడకుండా భోగి మంటలు వేస్తారని నిపుణులు చెబుతున్నాయి.

కమలాపురం : మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సోమవారం సంప్రదాయ బద్ధంగా భోగి పండుగను జరుపుకున్నారు. తెల్లవారు జామున తమ ఇళ్లల్లోని పురాతన వస్తువులతో పాటు గడ్డి తదితర వస్తువులతో వీధుల్లో భోగి మంటలు వేశారు. కమలాపురం పట్టణంతో పాటు గంగవరం, విభరాపురం, సంబటూరు, కోగటం, పందిళ్లపల్లె, నల్లింగాయపల్లె, చదిపిరాళ్ల, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి తదితర గ్రామాల్లో చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి తలా ఒక వస్తువును మంటల్లో వేసి భోగి మంటలు కాచుకున్నారు. అలాగే చిన్నపిల్లలకు భోగిపళ్లతో స్నానాలు చేయించారు.

పులివెందుల రూరల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మొదటి రోజు సోమవారం భోగి పండుగను పులివెందుల మండల పరిధిలోని గ్రామాల ప్రజలు నిర్వహించారు. భోగి పండుగ సందర్భంగా ప్రజలు తెల్లవారుజామున 4 గంటలకు ముగ్గులు వేసి, భోగి మంటలు వేసి చలి నుంచి ఉపశనం పొందారు.

ఎర్రగుంట్ల : సంక్రాంతి పండుగ సందర్భంగా మొదటి రోజు అయిన భోగి పండుగను ఎర్రగుంట్ల పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించారు. సోమవారం తెల్లవారి జాము నుంచే భోగి మంటలు వేశారు.


కమలాపురం పట్టణంలో భోగి మంటలు వేసి చలి కాచుకుంటున్న ప్రజలు

శిల్పారామంలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ఉలిమెల్ల రోడ్డులోని శిల్పారామంలో భోగి పండుగ రోజు సోమవారం కూరగాయల షాపు యజమాని యస్. నాగేంద్ర ప్రసాద్ సహకారంలో ప్రముఖ ఇంద్రజాల మాంత్రికుడు ఉపేంద్ర ఇంద్రజాల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. సాయంత్రం శిల్పారామంలో భోగి మంటలు వేశారు. భోగిమంటల్లో చెట్టు బెరడులు, ఆవు పేడతో చేసిన పిడకలను భోగి దండలుగా గుచ్చి ఈ భోగి మంటల్లో వేశారు. సోమవారం తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి వాడవాడలా భోగి మంటలు వేసి పూజలు నిర్వహించారు. భోగి పండుగ సందర్భంగా చిన్నారులకు ఇంటి గడప మీద కూర్చొబెట్టి భోగి పండ్లను తలపై వేసి ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆశీర్వదించారు.

వైఎస్సార్ లేక్‌లో..

సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి పండుగను పురష్కరించుకుని సోమవారం సాయంత్రం పట్టణంలోని వైఎస్సార్ లేక్‌లో కదిరి, బెంగళూరు మనస్ డ్యాన్స్ అకాడమీ వారు నిర్వహించిన కూచిపూడి నృత్యం అందరినీ ఆకట్టుకుంది. అలాగే కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు, బ్రహ్మాంజలి, దేవాది దేవా గణపతి దేవా తదితర పాటలకు వేసిన నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ బి. సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ బి.వరప్రసాద్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


లింగాల: ఇళ్ల ముంగిట భోగి మంటలు వేస్తున్న ప్రజలు

సింహాద్రిపురం : సంక్రాంతి పండుగను పురష్కరించుకుని సోమవారం భోగి పండుగను నిర్వహించారు. ఇళ్ల వాకిళ్ల వద్ద మహిళలు రంగు, రంగుల ముగ్గులు వేశారు. సాయంత్రం చిన్న పిల్లలకు భోగి పళ్లతో స్నానం చేయించారు.

లింగాల మండలంలో..

లింగాల : మండలంలో సోమవారం భోగి పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇళ్ల ముంగిట రంగు, రంగుల ముగ్గులు వేసి ఆవు పేడతో గొబ్బెమ్మలు చేసి పూలతో అలంకరించారు. అదేవిధంగా తెల్లవారు జామునే పిల్లలు, పెద్దలు ఇళ్ల ముంగిట భోగి మంటలు వేసి చలి కాపుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేంపల్లె : మండలం వ్యాప్తంగా సోమవారం భోగి సందర్భంగా ప్రజలు భోగి పండుగ నిర్వహించారు. ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


ముద్దనూరులో..


శిల్పారామంలో భోగి మంటలు వేసిన ఏఓ, సిబ్బంది

ధనుర్మాసం సందర్భంగా మహిళలు, భక్తులు ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

తొండూరు : మండల వ్యాప్తంగా సోమవారం భోగి పండుగను నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లోని ముళ్ల ముంగిట మహిళలు రంగు, రంగుల అందమైన ముగ్గులు వేశారు. అలాగే సాయంత్రం చిన్నారుల తలలపై రేగి పండ్లు వేసి ఆరోగ్యంగా ఉండాలని ఆశీర్వదించారు.

పెండ్లిమర్రి : భోగి పండుగను సోమవారం మండల ప్రజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహిళలు ఇంటి ముగింట రంగురంగులు ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు. వెయ్యినూతలకోన క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి, వెల్లటూరు చెన్నకేశవస్వామి ఆలయాలకు వెళ్లి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ముద్దనూరు : సంక్రాంతిని పురస్కరించుకొని సోమవారం భోగి పండుగను నిర్వహించారు. తెల్లవారుజామున భోగి మంటలు వేశారు.

సంప్రదాయాలకు నెలవు సంక్రాంతి


ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి

పెద్దముడియం : సంక్రాంతి పండుగ గ్రామీణ సంస్కృతి, సంప్రదా యాలకు నెలవు అని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం గుండ్లకుంట గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను పరిశీలించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆట విడుపుగా ముగ్గుల పోటీలు నిర్వహించామని తెలిపారు. నిత్యం పనుల్లో నిమగ్నమైన వారికి ఇలాంటి పోటీలు మరింత ఉత్సాహాన్ని అందిస్తాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయలకు సొంత గ్రామాల మీద మమకారానికి, రైతాంగానికి మనమిచ్చే గౌరవానికి, మన ప్రత్యేకమైన కళలకు ఈ సంక్రాంతి ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గిరిధర్ రెడ్డి, కామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



వైభవంగా శ్రీకృష్ణ, గోదాదేవి కల్యాణం

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణ, గోదాదేవిల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస పూజా కార్యక్రమాలు అత్యంత ఘనంగా ముగిశాయి. అంతకుముందు శ్రీరంగనాథ స్వామి వారి ఆలయంలో శ్రీరంగనాథ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక గోదాదేవి ఆలయంలో శ్రీకృష్ణ, గోదాదేవిల కల్యాణాన్ని శాస్త్రోయుక్తంగా మేళ తాళాల మధ్య వైభవంగా వేద సంప్రదాయాల ప్రకారం నిర్వహించారు. శ్రీరంగనాథస్వామి దేవస్థాన చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, ఈఓ వెంకటరమణ తదితరులు ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా ఉండి కార్యక్రమాన్ని నిర్వహించారు.


శ్రీకృష్ణగోదాదేవి కల్యాణోత్సవంలో అర్చకులు, భక్తులు

ఈ కల్యాణోత్సవంలో ఉభయ దారులు శ్రీనివాసులు, మంజుల దంపతులు, తిరుపాలు, సుబ్బమ్మ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చల్లా చంద్రశేఖర్, చిలకా గోపాల్ రెడ్డి, శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు పాల్గొన్నారు.

'అంతిమ'బాంధవులు

జమ్మలమడుగు : ప్రతి మనిషికీ మరణమనేది ఖాయం. ఆ అంతిమ ఘడియల్లో మోసేందుకు నలుగురు ఉండాలని కోరుకుంటారు ఎవరైనా. జమ్మలమడుగు ప్రభుత్వాసుత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. కారణం తెలియదు కానీ.. కన్నవారు, రక్తసంబంధీకులు సదరు యువకుడి అంత్యక్రియలు నిర్వహించేందుకు ముందుకురాలేదు. అటువంటి పరిస్థితిలో అన్నీ తామై సంప్రదాయం ప్రకారం యువకుడికి అంత్యక్రియలు నిర్వహించి మే ఐహెల్ప్ యూ సంస్థ ప్రతినిధులు మానవత్వం చాటారు. సోమవారం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కె.సురేంద్రాకుమార్ (26) అనే యువకుడు మృతి చెందాడు. అయితే సురేంద్రాకుమార్ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు కానీ, బంధువులు కానీ ఎవరూ రాలేదు. దీంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మే ఐహెల్ప్ యూ సంస్థను ఆశ్రయించారు. సంస్థ ప్రతినిధి సుభహాన్, అతని అనుచరులు సురేంద్రాకుమార్‌కు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, పాపిశెట్టి వెంకటలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.


అంత్యక్రియల్లో పాల్గొన్న మేఐ హెల్ప్‌యూ ప్రతినిధులు



కమనీయం.. కల్యాణం

వేంపల్లె : స్థానిక వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుసంధానమైన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. సోమవారం భోగి పండుగ పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు అచ్యుత నారాయణ నేతృత్వంలో పురోహితులు నిర్వహించిన కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించారు. బొచ్చు వెంకటసుబ్బారావు, కదిరేపల్లి ప్రసాద్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, భవనాసి రామ్మోహన్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి దంపతుల సహకారంతో ఈ కల్యాణాన్ని నిర్వహించారు. అలాగే మహిళలు వేసిన కోలాట నృత్యాలు అందరినీ అలరించాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీవారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంక్రాంతి కానుకగా డీఏను ప్రకటించాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఫరీష్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడచిపోయిందని.. ఇంత వరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. సంక్రాంతి కానుకగానైనా డీఏను ప్రకటించాలని కోరారు.





ముంజలు, మామిడిపండ్లు ముందే వచ్చేశాయ్


విక్రయానికి సిద్ధంగా ఉన్న తాటి ముంజలు


అమ్మకానికి ఉంచిన మామిడి పండ్లు

పులివెందుల రూరల్ : మామిడిపండ్ల కోసం సమ్మర్ ఎప్పుడొస్తుందా అంటూ చాలా మంది ఎదురుచూస్తూ ఉంటారు. మామిడిపండ్లు అంటే ప్రేమ అలాంటిది మరి. అయితే ఇప్పుడు ఆ అవసరమే లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎంచక్కా మామిడిపండ్లు దొరికేస్తున్నాయి. వేసవిలో రావాల్సిన మామిడి పండ్లు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. అంతే కాకుండా ఏప్రిల్‌లో లభించి ఎండ తీవ్రతను దూరం చేసే తాటిముంజలు సైతం అప్పుడే విక్రయానికి రహదారి పక్కన కనిపిస్తున్నాయి. తాటి ముంజలు, మామిడి పండ్లు డిసెంబర్ నెల నుంచి మార్కెట్‌లోకి వచ్చాయి. పులివెందుల మండలం అచ్చివెళ్లి, పుత్రాయునిపేట, ఎర్రిపల్లె తొండూరు మండలం అగడూరు గ్రామాల్లో వేల సంఖ్యలో తాటిచెట్లు ఉన్నాయి. గ్రామాల నుంచి తాటి ముంజలను తీసుకొచ్చి పులివెందులలో విక్రయిస్తున్నారు. డజను తాటి ముంజలు రూ.120, మామిడి పండ్లకు కదిరి తదితర ప్రాంతాలను తీసుకొచ్చి కిలో రూ.150 నుంచి రూ.200 విక్రయిస్తున్నారు.

